



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్, వేదికపై రాధాకృష్ణ, అంజిబాబు

సమస్యల తిష్ట....

- జిల్లాను వేధిస్తున్న అనేక సమస్యలు - నూతన పాలకుల వైపు ప్రజల చూపు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఏళ్ల కాలంగా సమస్యలు తిష్ట వేశాయి. దీంతో జిల్లా వాసులకు అనేక తిప్పలు తప్పడం లేదు. రాష్ట్రంలో నూతనంగా టిడిపి ప్రభుత్వం ఏర్పడనుండటంతో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎన్నికయ్యే మంత్రులు సమస్యలపై దృష్టి సారిస్తారని జిల్లా వాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు...

తప్పని వలస వెతలు

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. కోసిగి మండలంలో అత్యధికంగా 6వేల కుటుంబాలు వలస బాట పట్టాయి. ఉపాధి పనుల్లో సరైన కూలి దక్కకపోవడంతోనే వలస వెళ్తున్నట్లు వలసదారులు చెబుతున్నారు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హోసళ్లి, సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి.

సమస్యలకు నిలయంగా జిల్లా కేంద్ర

జిల్లా కేంద్రం పలు సమస్యలకు నిలయంగా మారింది. శివారు కాలనీలకు తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. కల్లూరుతో పాటు నూతనంగా నగర పాలక సంస్థ పరిధిలోకి వచ్చి చేరిన గ్రామాలలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో కూడా రెండు, మూడు రోజులకు ఒక సారి నీటిని వదులుతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. వర్షాలు వస్తే మురుగు నీరు నేలపై పారుతున్నాయి. నగర జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ సమస్య నెలకొంది.

సాగు, తాగు నీటికి తిప్పలే

ఆలూరు నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపై ఆధారపడి జీవిస్తారు. సాగు నీరు లేక పోవడం, సకాలంలో వర్షాలు లేక రైతులు, వ్యవసాయ కార్మికులు ఎక్కువగా సుదూర ప్రాంతాలకు వలసలు వెళు తున్నారు. తాగు నీటి కోసం ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి నుండి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందుతుంది. వర్షాకాలంలో వారానికి ఒకసారి, వేసవిలో 15 రోజుల నుండి 20 రోజులకు నీరు అందిస్తారు. నీటి సమస్య పరిష్కారానికి వామపక్షాల పోరాటంతో చిప్పగిరి మండలంలో 2008లో నగరడోన రిజర్వాయర్‌కు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసి వదిలేశారు. దానితో పాటు హాళహర్వి మండలంలోని వేదవతి రిజర్వాయర్ పూర్తి అయితే నియోజకవర్గంలో సాగు, తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

పనులకు నోచని బైపాస్ రోడ్డు

ఆదోని పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి 2005లో అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి బైపాస్ రోడ్డు మంజూరు చేశారు. భూసేకరణ, నిర్మాణం కోసం రూ.48 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి నుండి సర్వే పనులు జరిగాయి తప్ప ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు.

ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కొరత

కర్నూలు జిల్లా చుట్టూ అనేక విద్యా సంస్థలు ఉన్నప్పటికీ వాటి నిధుల కొరతతో అభివృద్ధి చెందడం లేదు. రాయలసీమ విశ్వ విద్యాలయంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఇక్కడ అనేక విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసి ఉన్నత విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ 500 కోట్ల నిధులను కూడా కేటాయిస్తే మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని విద్యార్థులు కోరుతున్నారు.

జాడలేని పారిశ్రామికాభివృద్ధి

ఓర్వకల్ పారిశ్రామికవాడలో దాదాపుగా దాదాపుగా 33 వేల ఎకరాల్లో కూడా భూములను గుర్తించింది. ఇప్పటికే గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో అనేక పరిశ్రమలు నెలకొల్పేందుకు సంస్థలు ముందుకు వచ్చి ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. ఇప్పటివరకు ఒప్పందాలు చేసుకున్నటువంటి పరిశ్రమలు ఒక రాయి కూడా వేయలేదు.

సిఐటియు బలోపేతమే

పర్సాకు నిజమైన నివాళి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఐటియు సంఘాన్ని బలోపేతం చేయడమే కార్మికోద్యమ నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్సాసత్యనారాయణకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎ.గఫూర్ అన్నారు. సోమవారం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మిక ,కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన పర్సా సత్యనారాయణ శత జయంతి పురస్కరించుకొని ముందుగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ పర్సాసత్యనారాయణ, నండూరి ప్రసాదరావు ఇద్దరు కలిసి నిర్మించిన సంఘమే సిఐటియు అని అన్నారు. నిర్మాణం కోసం చాలా కాలం వారు కృషి చేశారని తెలిపారు. పర్సా సత్యనారాయణ గుంటూరు జిల్లా కంభంపాడు గ్రామంలో జన్మించాడని ఆయన వృత్తి కోసం సింగరేణి బొగ్గు గనుల దగ్గరికి వెళ్లారని, అక్కడ పనిచేస్తూనే సింగరేణి కాలరీస్‌లో కార్మిక సంఘాన్ని ఎంతో కష్టపడి నిర్మించారని తెలిపారు. తర్వాత ఆయన అనేక కష్టాలు ఎదుర్కొన్నారని అనేక సంవత్సరాల పాటు అజ్ఞాత జీవితం గడపవలసి వచ్చిందని, తొమ్మిదేళ్లపాటు జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. పర్సా అనేక సంవత్సరాల పాటు కుటుంబానికి దూరంగా ఉన్నా వారి కుటుంబ సభ్యులు ప్రధానంగా ఆయన భార్య భారతి కుటుంబాన్ని పోషించుకుంటూ పర్సాకు తోడుగా నిలబడిందని తెలిపారు. పర్సాఆంధ్రప్రదేశ్ సిఐటియు అధ్యక్షులుగా, గౌరవ అధ్యక్షుడిగా, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షుడిగా, కార్మికులోకం సంపాదికుడుగా,అనేక సంవత్సరాలు పనిచేశాడని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు ఉద్యమం విస్తరించడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. శాసనసభ సభ్యులుగా కొనసాగుతూనే ఆ రోజుల్లో విశాఖ ఉక్కు కోసం శాసనసభ సభ్యత్వాన్ని త్యాగం చేసిన ఘనత పర్సాకేదక్కుతుందని అన్నారు. ఆయన ఉన్నంతకాలం అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ కార్మికులకు ఒరిగిందేమి ఉండదని, కొత్తగా ఏర్పడే ప్రభుత్వం అనుసరించే విధానాలను బట్టి మన పోరాటాలు ఉంటాయని తెలిపారు. ప్రజావ్యతిరేక విధానాలనే అనుసరిస్తే అందుకు తగిన రీతిలో ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సి ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నిర్వహించామని, ఆ ఉద్యమాల ఫలితంగానే మతతత్వ ప్రభుత్వ దూకుడు తగ్గించడానికి ప్రయత్నించామని అన్నారు. రాబోవు కాలంలో అంతకంటే ఎక్కువ ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఇంకా ఉందని తెలిపారు. లేబర్ కోడ్‌లను ఇప్పటికీ ప్రభుత్వం రద్దు చేయలేదని ప్రభుత్వం రద్దు చేసేంతవరకు మనం పోరాటం చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు, సిఐటియు న్యూసిటీ కమిటీ అధ్యక్షుడు నరసింహులు, ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ తదితరులు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ప్రభాకర్, సుధాకరప్ప, యూనియన్ నాయకులు మధ్యాహ్న భోజనం సంఘం యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం ప్రమాణ స్వీకారానికి

ప్రత్యేక బస్సులు ఏర్పాటు

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి గా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్ళదలచిన ప్రజలకు నియోజకవర్గానికి 4 బస్సులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి 4 బస్సులు ఈనెల 11న సాయంత్రం 6:30 గంటలకు బయలుదేరి, 12 న ఉదయం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార స్థలికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బస్సుకు 50 మంది చొప్పున నియోజకవర్గానికి 200 మంది ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్ళదలచిన ప్రజల వివరాలను స్థానిక ప్రజా ప్రతినిధులతో కోఆర్డినేట్ చేసుకొని తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఏ పాయింట్ వద్ద బస్సును ఏర్పాటు చేస్తారనే విషయాన్ని ప్రజలకు తెలియచేయాలని కలెక్టర్ సూచించారు. అదే విధంగా బస్సుల్లో వెళ్ళే ప్రజలకు పాసులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓను ఆదేశించారు.. నియోజకవర్గంలో బస్సులు ఏ పాయింట్ వద్ద పెడుతున్నారనే వివరాలను సోమవారం సాయంత్రం లోపు ఇవ్వాలని జిల్లా పరిషత్ సిఇఒను కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ లో డిఆర్ఒ మధుసూదన్ రావు, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేత హత్య కేసులో

సిఐ, ఎస్ఐ బదిలీ

- బాధ్యతలు స్వీకరించిన కొత్త సిఐ మధుసూదన్ రావు, ఎస్ఐ సునీల్ కుమార్

ప్రజాశక్తి-వెల్దుర్తి

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం టిడిపి నాయకుడు గిరినాథ్ చౌదరి హత్య నేపథ్యంలో వెల్దుర్తి సిఐ, ఎస్ఐలను బదిలీ చేశారు. ఆదివారం గిరినాథ్‌చౌదరిని వైసిపి కార్యకర్తలు హత్య చేశారు. సిఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి విధులలో నిర్లక్ష్యం వహించారని విఆర్‌కు పంపుతూ సోమవారం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వారి స్థానంలో వెల్దుర్తి సిఐగా కర్నూల్ సర్కిల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మధుసూదన్ రావును, వెల్దుర్తిఎస్ఐగా కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సునీల్ కుమార్ నియమించారు. వారు కూడా బాధ్యతలు స్వీకరించారు.

హత్య కేసులో 16 మందిపై కేసు నమోదు

వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో ఆదివారం టిడిపి నాయకుడు గిరినాథ్ చౌదరిని హత్య చేసిన కేసులో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వైసిపి కార్యకర్తలు రమేష్, రామకృష్ణలతో కలిపి16 మందిపై కేసు నమోదు చేసినట్లు సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ మధుసూదన్ రావు, ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. హత్యకు కారకులైన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈలోపు వెల్దుర్తి మండల ప్రజలు. ఇరుపార్టీల కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. ఎటువంటి ఘర్షణలు జరగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో పోలీసు బందోబస్తుతో పికెటింగ్ ఏర్పాటు చేశామని, ఏవైనా ఘర్షణలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.



బదిలీ అయిన సిఐ, ఎస్ఐ

టిడిపి నాయకుని అంత్యక్రియలకు హాజరైన టిడిపి నాయకులు

వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డి పల్లె గ్రామంలో ఆదివారం హత్యకు గురైన గిరినాథ్ చౌదరి అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. అంత్యక్రియలకు కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు, రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, మండల నాయకులు బలరాం గౌడ్, జ్ఞానేశ్వర్ గౌడ్, రమాకాంత్ రెడ్డి, కార్యకర్తలు భారీగా హాజరై భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాం బాబు మాట్లాడుతూ గిరినాథ్ చౌదరి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.



నివాళులర్పిస్తున్న తిక్కారెడ్డి, సోమిశెట్టి, కెఇ.శ్యాంకుమార్, నాయకులు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గౌరుచరిత, వెంకట్‌రెడ్డి, జయసూర్య

చంద్రబాబును కలిసిన గౌరుదంపతులు

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో ఉమ్మడి కూటమి టిడిపి ఎమ్మెల్యేగా గెలుపొందిన గౌరు చరిత రెడ్డి , టీడీపీ సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సోమవారం విజయవాడలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు.

మంత్రి పదవి రేసులో బొగ్గుల దస్తగిరి

40 ఏళ్ల తర్వాత టిడిపి తొలిసారి విజయం-మాట నిలుపుకున్న ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కోడుమూరు నియోజకవర్గం నుంచి నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన బొగ్గుల దస్తగిరిని మంత్రివర్గ పదవి వరించనుందా అన్న ప్రశ్నకు నియోజకవర్గం ప్రజల నుంచి అవునన్న సమాధానమే వినిపిస్తోంది. వివిధ సమీకరణాల నేపథ్యంలో ఎస్‌సి నియోజకవర్గాల నుంచి రిజర్వేషన్ కేటగిరీలో మంత్రివర్గ కేటాయింపుల అంశాన్ని పరిశీలిస్తే ఆ జాబితాలో ఆయన పేరే ముందు వినిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నియోజకవర్గం చరిత్రను పరిశీలిస్తే నియోజకవర్గ ఏర్పాటుచేసిన నాటి నుంచి మొదలు ఇప్పటివరకు కేవలం రెండుసార్లు మాత్రమే టిడిపి విజయాన్ని సాధించింది. 1985లో నాటి టిడిపి యతరఫున ఎమ్మెల్యేగా శిఖామణి తొలిసారి విజయం సాధించారు. మరోసారి విజయం కోసం ఎదురుచూసిన టిడిపికి 40 ఏళ్ళుగా నిరాశే ఎదురయింది. సుదీర్ఘకాలం తర్వాత టిడిపి అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, వైసిపి అభ్యర్థిపై గెలుపొంది టిడిపి ఆశలు చిగురించేలా చేశారు. 21,853 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఈ విజయం టిడిపి చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పార్టీ అధిష్టానం ఎస్సీ నియోజకవర్గం రిజర్వేషన్ల ప్రాతిపదికన కుల సమీకరణాలు నేపథ్యంలో దళిత సామాజిక వర్గం నుంచి మంత్రివర్గంలో చోటు దక్కించుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. అదే విధంగా కర్నూలు జిల్లా నుంచి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వర్‌రెడ్డి, కర్నూలు నుంచి టిజి.భరత్, పాణ్యం నుంచి మహిళా కోటలో గౌరుచరితరెడ్డి, నంద్యాల జిల్లా నుంచి బిసి.జనార్దన్‌రెడ్డి, నంద్యాల నుంచి ఎన్ఎండి ఫరూక్, ఆళ్లగడ్డ నుంచి అఖిలప్రియ, డోన్ నుంచి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి మంత్రి పదవి కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎవరెవరికి మంత్రిపదవులు వస్తాయో వేచి చూడాలి.

మాట నిలుపుకున్న విష్ణువర్ధన్ రెడ్డి

2024 ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో టిడిపిని విజయపథంలో నడిపిస్తానని అధిష్టానం వద్ద కోడుమూరు నియోజకవర్గం టిడిపి సీనియర్ నేత, నియోజకవర్గ ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి శపథం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన తన బాధ్యతగా కర్నూలు ఎంపీ స్థానాన్ని , కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానాన్ని గెలిపించుకోవడం బాధ్యతగా తీసుకున్నారు. గెలుపు కోసం ప్రణాళికలను రచించి వాటిని సమర్థవంతంగా అమలు చేయడంలో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో తన నియోజకవర్గం నుంచి ఇద్దరు అభ్యర్థులకు (ఎంపీ, ఎమ్మెల్యే) సీట్లను సాధించుకుని గెలిపించుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీకి ఇచ్చిన మాటను నిలుపుకున్న నేపథ్యంలో ఆయన తన నియోజకవర్గం నుంచి మంత్రి పదవిని కూడా కోరుకునే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. దీనికి తోడు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వ్యక్తిగతంగా ఉన్నత విద్యావంతుడు కావడం ఆయనకు మరొక అదనపు అర్హతగా కలిసి వస్తుంది. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లా నుంచి కోడుమూరు నియోజకవర్గానికి చోటు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికే పార్టీ అధిష్టానం మంత్రివర్గ విస్తరణ పై చర్చలు సాగిస్తున్నారని సమాచారం. చర్చల్లో కూడా వివిధ కుల సమీకరణలను కూడా అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



పని మెరుగుదలకు వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

జిజిహెచ్‌లో విభాగాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓపి కౌంటర్ , క్యాజువాలిటీ విభాగాలను ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్ సి ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓపి కౌంటర్ , క్యాజువాలిటీ విభాగాలను ఆకస్మిక తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని ఈ-డిజిటల్ ఓపి కౌంటర్ , ఇతర ఓపి కౌంటర్లను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది పనితీరును మెరుగు పరిచేందుకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రి ఆవరణలోని ఓపి కోసం పేషెంట్స్ రద్దీ దృష్ట్యా ఈ డిజిటల్ ఒపి కౌంటర్ , ఇతర కౌంటర్లలో ఉదయం 8-30 నుంచి ఓపి ఇచ్చే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ డిజిటల్ కౌంటర్ కు మంచి స్పందన వచ్చి బాగా ఉపయోగపడుతుందని, ఇంకొక ఈ-డిజిటల్ కౌంటర్ కూడా రేపు ప్రారంభించాలని ఆదేశించారు. తొందరగా ఓపికి ఇచ్చేకి వీలుగా ఫార్మసీ విద్యార్థులను కూడా ఉపయోగించుకోవడం చాలా బాగా సక్సెస్ అయిందన్నారు. క్యాజువాలిటీ విభాగం తనిఖీ అనంతరం అక్కడ ఉన్న పేషంట్ల గురించి ఆరా తీశారు. పేషెంట్లకు కావాల్సిన సదుపాయాలు , అత్యవసర మెడిసిన్ అందుబాటులో ఉన్నాయా అని సి ఎంఒ ద్వారా ఆరా తీశారు. అక్కడ సెక్షన్ మిషన్లు తక్కువగా ఉండడం గమనించి త్వరితగతిని వారికి రెండు సెక్షన్ మిషన్లు మంజూరు చేశారు. ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ , ఎఆర్ఎం ఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ శివబాల నగాంజన్, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ శ్వేత, ఆసుపత్రి ఎడి రమేష్ బాబు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



విత్తన దుకాణాలలో తనిఖీ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పత్తికొండ

శ్రీ లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్ విత్తన షాపులో రికార్డులను తనిఖీ చేశామని పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్ తెలిపారు. 'విత్తన విక్రయాలలో నకిలీ బిల్లు-రైతన్న జేబుకు చెల్లు' అనే శీర్షికను ప్రజాశక్తి ప్రచురించడం పాఠకులకు విధితమే. సోమవారం పత్తికొండ ఎఒ వెంకట రాముడు ఆధ్వర్యంలో ఎడిఎ మోహన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతు విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే కచ్చితంగా బిల్లు ఇవ్వాలి. షాప్ యొక్క వివరాలు రైతు వివరాలు, కొనుగోలు చేసిన సీడ్ వివరాలు తప్పనిసరిగా పొందపరిచి రైతులకు అందజేయాలన్నారు. రైతుకు సరైన బిల్లు ఇవ్వకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. శ్రీ లక్ష్మీనరసింహా ఫర్టిలైజర్ షాపు రైతుకు సరైన బిల్లు ఇవ్వనందున సుమారు 93,480 విలువగల విత్తనాలను నిలుపుదల చేశామని తెలిపారు. విత్తన చట్టం ప్రకారం 1966 సిఫారసు చేస్తూ శోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఏడు రోజులలోపు సమాధానం ఇవ్వకపోతే జిల్లా ఉన్నతాధికారుల క్రమశిక్షణ చర్యలు నిమిత్తం విత్తన లైసెన్సును ఒక నెల సస్పెండ్ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

నకిలీ విత్తనాలను అరికట్టాలి -ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: రైతులకు 90 శాతం సబ్సిడీతో కూడిన నాణ్యమైన అన్నిరకాల విత్తనాలను ప్రభుత్వం అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బృందం గొందిపర్ల, పూలతోట, దొడ్డిపాడు, తాంద్రపాడు గ్రామాల్లో రైతుల పొలాలను పరిశీలించింది. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, కర్నూలు మండల కార్యదర్శి జి.ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులు తాంద్రపాడు సర్పంచి బాలపీర, చంద్రయ్య, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, గోపాలు తదితరులు పాల్గొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ మాట్లాడుతూ ఈ సంవత్సరం రుతుపవనాలు త్వరగా వచ్చి వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయని, రైతులందరూ పొలాలను విత్తనాలు వేయడానికి సంసిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు పత్తి ,మొక్కజొన్న, కందులు, మిరప, ఉల్లి ,ఆముదం, కొర్రలు, మినుము, పెసలు వంటి విత్తనాలు 90శాతం సబ్సిడీతోనే ఇవ్వాలని నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా జిల్లా అంతటా కరువు పరిస్థితులు ఉన్నాయని, ఇప్పటివరకు రైతులు కోలుకోలేనటువంటి పరిస్థితి కర్నూలు జిల్లాలో నెలకొందన్నారు. గత ప్రభుత్వం అనేక రకాల ఆశలు పెట్టి రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయంగా రూ.20,000 ఇస్తానని ఎన్నికలలో వాగ్దానం చేసిందని, వెంటనే వాగ్దానాన్ని అమలు చేయడం కోసం ముందస్తుగా పడుతున్నటువంటి వర్షాలు రైతులకు మేలు చేస్తాయని, అందుకు అవసరమైన పెట్టుబడి రైతులకు అవసరం కాబట్టి పెట్టుబడి సహాయం కింద తక్షణమే రైతుల ఖాతాలో రూ.20000 జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ విత్తనాలు అరికట్టడానికి వ్యవసాయ శాఖ ప్రత్యేకమైన నిఘాను ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల పైన ఉక్కు పాదం మోపాలని లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని సూచించారు.



మాట్లాడుతున్న జి.రామకృష్ణ

తుంగభద్ర సహకారంతో వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని కొండాపురం, ముడుమాల గ్రామాల్లోని తుంగభద్ర పరస్పర రైతు సహకార కేంద్రంలో వరి విత్తనాలను బిసిఒ ఉదయ్ తెలిపారు. నాణ్యమైన విత్తనాలకు, నాణ్యమైన ఎరువులు, మందులకు, సేంద్రియ ఎరువులకు నిలయం ఈ కేంద్రాలని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పంపిణీలో పేర్కొన్నారు.అలాగే ఆర్ఎన్ఆర్, బిపిటి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని 25 కేజీల ప్యాకెట్ ధర రూ.1050 మాత్రమేనన్నారు.




మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

ప్రతి కుటుంబానికీ లబ్ది
- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

పేదల పక్షపాతి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ లబ్ది చేకూరుతుందని, ఆ దిశగా కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి ఇన్‌ఛార్జీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మీనాక్షి నాయుడు తెలిపారు. పట్టణంలో మీనాక్షినాయుడు, టిడిపి సీనియర్ ఉమాపతి నాయుడు సమక్షంలో ఆదోని మండలం కుప్పగల్ మాజీ ఎంపిటిసి నాగిరెడ్డి అనుచరులతో సోమవారం వైసిపి నుంచి టిడిపిలో చేరారు. నాగిరెడ్డి మాట్లాడుతూ... చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీ నిధులను మళ్లించి గ్రామాలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. అనంతరం మీనాక్షి నాయుడు మాట్లాడారు. సంక్షేమం పేరుతో అభివృద్ధిని విస్మరించి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. స్థానికంగానే సంపాదన సృష్టించి సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయడమే టిడిపి లక్ష్యమన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని పేర్కొన్నారు. శివప్ప, అయ్యన్న, బసవరాజు, షణ్ముఖ, రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి : జనసేన ఇన్‌ఛార్జీ లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న కోరారు. సోమవారం పెద్దకడబూరు, కౌతాళం మండలాల సమావేశం నిర్వహించారు. లక్ష్మన్నను శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ కూడా భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలకు అండగా పవన్ కల్యాణ్ ఉంటారని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి అఖండ మెజార్టీ సాధించేందుకు పవన్ కల్యాణ్ క్రియాశీలక పాత్ర పోషించారని తెలిపారు. సయ్యద్, కరీం, షర్ఫుద్దీన్, మెహబూబ్, వలీ, షాషావలీ, వీరేష్, కౌతాళం మండల నాయకులు చంద్రశేఖర్, రవికుమార్, నరసింహులు, మారయ్య, మహేష్, నాగరాజు, నాగరాజు, రామ నాయుడు, హుసేనిపాల్గొన్నారు.

18 నుంచి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఆలూరు

ఈనెల 18 నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు మొదలవుతున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ పాసైన ఆలూరు ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ గ్రూపుల వివరాలు బికాం (కంప్యూటర్ అప్లికేషన్ మేజర్), బిఎ (హిస్టరీ మేజర్), బిఎస్సి (జువాలజీ మేజర్) ఉన్నట్లు తెలిపారు. అడ్మిషన్ కోసం ముందస్తుగా సీటు రిజర్వ్ కోసం కళాశాల అధ్యాపకుల ఫోన్ నెంబర్లు 9494967069, 9849483001, 9398941699, 9704204681, 6300144191, 9885096890ను సంప్రదించాలని కోరారు.

విరుపాక్షికి నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - దేవనకొండ

ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన బి.విరుపాక్షికి వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం తెర్నేకల్ సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్, వైసిపి జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూన్ రెడ్డి, ఎంపిటిసి నామాల శ్రీను, ఉప సర్పంచి బెల్ ఈరన్న, మాజీ ఎంపిటిసి చాప ఈరన్న మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడారు. తన విజయానికి కృషి చేసిన తెర్నేకల్ సర్పంచి అరుణ్‌కుమార్, సురేంద్ర రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీను, ఈరన్న, గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. మండలానికి, తెర్నేకల్ గ్రామానికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. వైసిపి నాయకులు బెన్న వెంకట్రాముడు, కురువ మల్లేష్, డబుల్ మాబు, చాకలి బడేసాబ్, దుమ్ము హనుమంతు, గోపి, నాగన్న, ఏసేపు, సాల్మన్, ఎర్రన్న, ఎబిఎం చర్చి సంఘం పెద్దలు, ఫిలిప్, శ్యామ్సన్, ఏసేపు, మాదన్న, వైసిపి ఆలూరు యువ నాయకులు పులి నరేష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఖరీఫ్ సాగు ముమ్మరం

- మంచి వర్షాలు కురవడంతో సంతోషంలో రైతులు
- పొలాలను విత్తనానికి సిద్ధం చేసుకుంటున్న వైనం

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్రంలో నైరుతి పవనాలు రావడంతో గత వారం నుంచి వర్షాలు విరివిగా కురుస్తున్నాయి. మంచి కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. పదునైన వర్షాలు రావడంతో రైతులందరూ పొలాలను సిద్ధం చేసుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. పొలాల్లో మంచి పదునైన వర్షాలు చేస్తేనే మంచి దిగుబడి రావడానికి ఆస్కారం ఉంటుంది.

చిప్పగిరి మండలంలో మొత్తం 17,665 హెక్టార్లలో సాగు విస్తీర్ణం ఉంది. ఖరీఫ్‌లో సాగు అవుతున్న విస్తీర్ణం 7,400 హెక్టార్లు. ఖరీఫ్‌లో సాగు చేసుకునే పంటలకు రైతులందరూ తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో ఎక్కువగా ఎర్ర నేల పొలంలో కంది, వేరుశనగ, కొర్రలు, సజ్జలు వేసుకోవడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఏ పంటలు వేసుకుంటే దిగుబడి ఎక్కువగా వస్తుందనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ అధికారులను రైతులు సంప్రదిస్తున్నారు. ముందుగా పొలాలను దుక్కు దున్నుకోవడం ద్వారా వర్షాలు పడినప్పుడు తేమను పట్టుకుంటుందని, దానివల్ల ఒక వర్షం ఆలస్యమైనా పొలంలో ఉన్న తేమ పనికొస్తుందని వ్యవసాయ శాఖాధికారులు తెలుపుతున్నారు. ముఖ్యంగా పొలంలో వేసిన పంటనే మళ్లీ మళ్లీ వేసుకోకుండా పంట మార్పిడి చేసుకుంటే పంట దిగుబడి పెరగడానికి ఆస్కారం ఏర్పడుతుందని అధికారులు తెలుపుతున్నారు. పొలంలో పెంట ఎరువులు వేసుకుంటే మంచి దిగుబడి వస్తుందని, ఫర్టిలైజర్స్ ఎరువుల వాడకం తగ్గించుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. విత్తనాలు తీసుకొని రైతులందరూ నాణ్యమైన విత్తనాలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.


విత్తనం వేసుకోవడానికి సిద్ధం చేసుకుంటున్న రైతు

కంది సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- రైతు, మస్తాన్, నేమకల్లు గ్రామం



కంది పంట సాగు చేసుకోవడానికి తన పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాను. గతేడాది కంటే ఈ ఏడాది వర్షాలు కూడా బాగా కురుస్తున్నాయి. కందికి మంచి ధర ఉన్నందున ఈ ఏడాది కూడా కంది సాగు చేసుకోవడానికి మా రైతులంతా ఆసక్తి చూపుతున్నాం.

'కార్మిక వర్గ బలోపేతమే నిజమైన నివాళి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సిఐటియు, కార్మిక వర్గాన్ని బలోపేతం చేయడమే కార్మికోద్యమ నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్సా సత్యనారాయణకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు తెలిపారు. సోమవారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పర్సా సత్యనారాయణ శత జయంతి సందర్భంగా ఆయన రచించిన 'నేను.. నా ప్రజా జీవితం' అనే పుస్తకాన్ని పరిచయం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పర్సా సత్యనారాయణ, నండూరి ప్రసాదరావు కలిసి నిర్మించిన సంఘమే సిఐటియు అని తెలిపారు. నిర్మాణం కోసం చాలా కాలం వారు కృషి చేశారని చెప్పారు. పర్సా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులుగాను, గౌరవాధ్యక్షులుగాను, జాతీయ ఉపాధ్యక్షులుగాను పని చేశారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఉస్మాన్ వలీ, రమేష్, సత్తార్, యుగంధర్, రాజు పాల్గొన్నారు.


పుస్తకాన్ని పరిచయం చేస్తున్న నాయకులు

'హెడ్వర్డ్'ను వినియోగించుకోండి
- క్లబ్ అధ్యక్షులు గుమ్మనూరు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులో స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన హెడ్వర్డ్ రీడింగ్ (కాస్మోటిక్ పాలిటిన్) క్లబ్‌ను ఉద్యోగ, రిటైర్డ్ ఉద్యోగ, క్లబ్ మెంబర్ల విశ్రాంతి, రీడింగ్ కోసం ఉపయోగించుకోవాలని, రాజకీయాలు, మందుబాబుల కోసం కాదని క్లబ్ అధ్యక్షులు గుమ్మానూరు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు, రూపురేఖలు మార్చి క్లబ్ నిబంధనల ప్రకారం ఉపయోగించుకోవాలని తెలిపారు. నూతన కమిటీని ఎన్నుకొనేంత వరకు త్రీ మ్యాన్ కమిటీ సభ్యులుగా రిటైర్డ్ డీఎస్పీ గంగాధర్ రెడ్డి, మొలగవల్లి శీనప్ప, న్యాయవాది షేక్షావలీ నిర్వహించాలని చెప్పారు. క్లబ్ గత కార్యదర్శి షాపుల బాడుగలు, మెయింటనెన్స్ వివరాలు తెలపాలని, లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులు

మూకుమ్మడిగా రాజీనామాలు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఇన్‌ఛార్జీ కమిటీగా ఉన్న ఛైర్మన్ ఎం.మల్లికార్జున, కమిటీ సభ్యులు ఎం.సహారాభాను, లక్ష్మీలు తమ రాజీనామా లేఖను ఆమోదించాలని సోమవారం డివిజనల్ సహకార అధికారికి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటివరకు వ్యవసాయ సహకార పరపతి సంఘానికి తాము సేవలు అందించామని తెలిపారు. ఇక నుంచి అనివార్య కారణాల వల్ల విధులకు హాజరు కాలేకపోతున్నామని చెప్పారు. తమ వల్ల రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా రాజీనామా లేఖను ఆమోదించాలని సంబంధిత అధికారికి పంపినట్లు పేర్కొన్నారు.


ఛైర్మన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఛైర్మన్‌కు సన్మానం

ఇప్పటివరకు మండల ప్రజలకు, రైతులకు ఉత్తమ సేవలందించినందుకు వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ మల్లికార్జునను సిఇఒ నీలకంఠ, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటివరకు మంచి సేవలందించి మండల ప్రజల మన్ననలు పొందారని తెలిపారు.

సినిమా హాలు కాదు.. కెనరా బ్యాంకు..!

ప్రజాశక్తి - కౌతాళం

ఒక కొత్త సినిమా రిలీజ్ అయితే ఆ సినీ హీరో అభిమానులు ఎలా తరలి వస్తారో.. అలా తరలివచ్చారు ప్రజలు..! తెల్లవారుజాము నుంచి క్యూ కట్టారు. ఆడ, మగ తేడా లేకుండా గంటల తరబడి వేచి ఉన్నారు. ఇది ఒక సినిమా హాలు అనుకుంటే తప్పులో కాలు వేసినట్లే..! మండల కేంద్రమైన కౌతాళంలోని కెనరా బ్యాంకు ముందు ఉన్న పరిస్థితి.

ఖాతాదారులు కెనరా బ్యాంకులో డబ్బులు తీయాలన్నా, డబ్బులు జమ చేయాలన్నా, పంట రుణాలు కావాలన్నా తెల్లవారుజామున 3 గంటలకే బ్యాంకుకు చేరుకుంటున్నారు. బ్యాంకు పాస్ పుస్తకాలతో పాటు తెల్లవారుజామున 3 గంటల నుంచి క్యూలైన్‌లో నిలబడితే, బ్యాంకులో తమ పనిని ముగించుకొని ఎప్పుడు బయటికి వస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్ల నగదును ప్రభుత్వం బ్యాంకులో జమ చేసింది. పింఛనుదారులు కూడా డబ్బుల కోసం పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో వ్యవసాయ పనుల కోసం, పంట రుణాల కోసం రైతులు బ్యాంకులను ఆశ్రయించక తప్పడం లేదు. గత వారం రోజుల నుంచి కౌతాళంలోని కెనరా బ్యాంకు ముందు ఇలాంటి పరిస్థితి ఉంది. కొన్ని సందర్భాల్లో తోపులాటలో బ్యాంకు ఖాతాదారు లు మధ్యలోనే ఇంటికి వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బ్యాంకు అధికారులు స్పందించి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కెనరా బ్యాంకు ముందు ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు

దేవాలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని శుక్రవారం పేటలో వెలసిన శ్రీజమ్మి మరద రామ లింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి అంబల్ డాగీ ఈరన్న సతీమణి, కీర్తిశేషులు సరోజమ్మ పేరిట కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందించినట్లు దేవాలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. పురాతన దేవాలయాలను కాపాడుకోవడానికి ముందుకు రావాలన్నారు.


విరాళం అందజేస్తున్న దాతలు

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఎమ్మెల్యే ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలో బాలకృష్ణ అభిమానులు వేడుకలు నిర్వహించారు. రాఘవేంద్ర రెడ్డిని శాలువాలు, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు కేక్ తినిపించు కొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాధవరం మాజీ సర్పంచి ఎన్.రఘునాథ్ రెడ్డి, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు హుసేన్ ఆలం, ఉరుకుందు, మైబు, మహ్మద్, ఇమ్రాన్, యాసిన్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని టిడిపి కార్యాలయంలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎన్‌టిఆర్ అభిమానులు, బాలకృష్ణ అభిమానులు, తెలుగు మహిళలు కేక్ కట్ చేసుకొని సంబరాలు చేసుకున్నారు. రంగస్వామి గౌడు పాల్గొన్నారు.


మంత్రాలయంలో రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

ఆదోని : సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య పుట్టినరోజు సందర్భంగా హిందూపురంలో ఆదోని అభిమాన సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాలయ్య మాట్లాడుతూ... ఆదోనిలో ఎన్‌డిఎ కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించినందుకు, ఆదోని ఇన్‌ఛార్జీ మీనాక్షినాయుడు, అభిమానులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఆదోని బాలయ్య అభిమానుల సంఘం అధ్యక్షులు ఎన్.సజ్జాద్ హుస్సేన్ బాలయ్యకు మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.


బాలయ్యతో సజ్జాద్ హుస్సేన్


ఎమ్మిగనూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కంప్యూటర్ శిక్షణ ఎంతో అవసరం
- కరస్పాండెంట్ రమేష్

ప్రజాశక్తి - కౌతాళం

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఎంతో అవసరమని శ్రీపండిట్ పుట్టరాజ్ గవాయి ఎడ్యుకేషన్ సొసైటీ(రి) సి-టెక్ కరస్పాండెంట్ రమేష్ పేర్కొన్నారు. సోమవారం కంప్యూటర్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించి 9వ సంవత్సరం పూర్తయిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంగీత విద్వాంసులు అంబన్న, మహాదేవ ఓంకార్ ఖాదర్ బాషా, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. రాష్ట్రంలోనే అక్షరాస్యతలో వెనుకబడిన మండలాల్లో ఒకటైన కౌతాళంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి విద్యార్థికీ, ఉపాధ్యాయులకు ఈ కంప్యూటర్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. డిగ్రీ, బిటెక్, ఎంటెక్ చదివినా ఉద్యోగం చేయాలంటే ముందుగా కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు ఎంత ఉందో పరిశీలిస్తారన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ... వేసవిలో కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం కంప్యూటర్ శిక్షణ నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు